కిన్నెరసాని.. కర్షకులకు శాపం

- ఏటా వందల ఎకరాల పంటలు నీటిపాలు
- నష్టపోతున్న పాల్వంచ, బూర్గంపాడు మండలాల రైతులు
- నష్టపరిహారం ఇవ్వాలని వేడుకోలు


నాగారం వద్ద కోతకు గురైన వరిపొలం

పాల్వంచరూరల్: కిన్నెరసాని ప్రాజెక్ట్ కర్షకుల పాలిట శాపంగా మారింది. ప్రతీ సంవత్సరం వానాకాలంలో గేట్లు ఎత్తడం ద్వారా వందల ఎకరాల పంట నీటిపాలై రైతులకు తీవ్రనష్టాన్ని కలుగజేస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు. మండల పరిధి కిన్నెరసాని గ్రామపంచాయతీలో ఉన్న కిన్నెరసాని జలాశయం నీటినిల్వ సామర్థ్యం 407 అడుగులు. ప్రాజెక్ట్ గేట్లు ఎత్తితే పరీవాహక ప్రాంతంలోని 30 కిలోమీటర్ల దూరం నీరు ప్రవహించి గోదావరి నదిలో కలుస్తుంది.

కిన్నెరసాని పరీవాహక ప్రాంతం...
కిన్నెరసాని పరీవాహక పరిధిలో పాల్వంచ మండలంలోని కిన్నెరసాని, యానంబైల్, పునుకుల, పాండురంగాపురం, సూరారం, సోములగూడెం, రంగాపురం, నాగారం, నారాయణరావుపేట, దంతలబోరు గ్రామాల పరిధిలో వాగుకు ఇరువైపుల సమారు 1500 ఎకరాల ఆయకట్టు సాగు అవుతుంది. అదేవిధంగా బూర్గంపాడు మండలంలో పినపాక పట్టినగర్, సోంపెల్లి, మిట్టపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో 500 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో రైతులు నాట్లు వేసుకున్న తర్వాత కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తినప్పుడు పరివాహక ప్రాంతంలో రెండు మండలాలకు చెందిన రైతుల పంటలు నీటమునిగిపోవడం, కొట్టుకపోవడంతో రైతులు పంటనష్టపోయి అప్పుల పాలవుతున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరిగినప్పుడు జెన్కో అధికారులు ప్రాజెక్ట్ గేట్లను ఎత్తివేస్తున్నారు. దీంతో నది పరివాహక ప్రాంతంలోని పంటలతోపాటు, విద్యుత్ మోటార్లు కొట్టుకపోతున్నాయి. గతేడాది 12గేట్లు ఎత్తివేయడంతో నదీ పరివాహక ప్రాంతంలో రైతుల పంటలు నీటిపాలై తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది అయినా గతేడాది నష్టాన్ని పూడ్చుకుందామని భావించిన రైతులు ఆశగా పంటలను సాగుచేశారు. మళ్లీ ప్రకృతి పగబట్టినట్లు నాలుగురోజుల క్రితం ఒక్కసారిగా 12గేట్లు ఎత్తివేసి 1.4 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలి వేయడంతో రెండు మండలాలకు చెందిన పంటపొలాలు వరద ప్రవాహానికి కొట్టుకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పరిష్కార మార్గం...
కిన్నెరసాని నది పరీవాహక ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా ఉండాలంటే ప్రాజెక్ట్ అధికారులు వానాకాలం సీజన్‌లో రిజర్వాయర్‌లో నీటి మట్టం లెవల్‌ను తక్కువగా అంటే 400–401 లెవల్ ఉంచితే, గేట్లు ఎత్తినా.. రైతుల పంటలు ముంపునకు గురికాకుండా ఉంటాయని రైతులు అంటున్నారు. నీటి మట్టం ఎక్కువగా ఉంచడం వలన ఎగువ నుంచి వరద వచ్చినప్పుడు ఒక్కసారిగా గేట్లు ఎత్తడం వలన బారీగా నష్టం జరుగుతోంది.

గ్రామాలూ జలమయం...
కిన్నెరసాని ప్రాజెక్ట్ 12గేట్లు ఒక్కసారిగా ఎత్తడంతో యానంబైల్ గ్రామంలో శ్మశానవాటికతోపాటు పంటపొలాలు నీటమునిగిపోగా వందకుపైగా రైతుల విద్యుత్ మోటార్లు వరదలో కొట్టుకపోయాయి. దీనికి తోడు కిన్నెరసాని గ్రామం, పాండురంగాపురం గ్రామాల్లో శివారు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి.


వరిపొలంలో ఇసుక మేట


సోములగూడెం వద్ద నీటమునిగిన పొలాలు

పరిహారం చెల్లించాలి..



మాకున్న ఎకరం పొలంలో వరి సాగు చేశాను. ఎకరానికి రూ.40వేల పెట్టుబడి పెట్టుబడి అయింది. కిన్నెరసాని గేట్లు ఎత్తడంతో పొలం మొత్తం కొట్టుకపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. – జలగం చక్రం, రైతు, నాగారం

రెండేళ్లుగా నష్టం వాటిల్లుతోంది..



కిన్నెరసాని వాగు పక్కన నాలుగు ఎకరాల పొలం ఉంది. గేట్లు ఒక్కసారిగా ఎత్తడం వలన వరదకు ఒక ఎకరం మొత్తం మట్టితో సహా కొట్టుకుపోగా, మరో మూడు ఎకరాల్లో ఇసుక మేట వేసింది. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇవ్వాలి. – జె.సత్యనారాయణ, రైతు, నాగారం

ఉధృతిని బట్టి గేట్లను ఎత్తుతాం..



భారీ వర్షం కారణంగా ప్రాజెక్టులోకి ఒక్కసారిగా వరద వచ్చింది. దీంతో 12 గేట్లను ఎత్తడం జరిగింది. హెచ్చరికలు జారీ చేసిన తర్వాతనే గేట్లను ఎత్తడం జరుగుతుంది. విపత్తు వచ్చినప్పుడు వరద ఉధృతిని బట్టి గేట్లను ఎత్తడం జరుగుతుంది. – ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ సీఈ

అధికారుల నిర్లక్ష్యంతోనే పంట నష్టం


సోములగూడెం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పాల్వంచరూరల్: కిన్నెరసాని ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులకు, ప్రజలకు నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని బస్వతారక కాలనీ, నాగారం, రంగాపురం, నాగారం కాలనీ, సోములగూడెం గ్రామాలతోపాటు, మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ, హమాలీ కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా తన పర్యటనకు ముందస్తు సమాచారం అందించినా.. గైర్హాజరైన వివిధ ప్రభుత్వశాఖల అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. వరద కారణంగా దెబ్బతిన్న రహదార్లు, విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఇసుక మేటలు పెట్టి నష్టపోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, ఇరిగేషన్ అధికారి దేవదాస్, చంద్రశేఖర్, విద్యుత్‌శాఖ డీఈ నందయ్య, ఆర్అండ్‌బీ శాఖ అధికారి రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, అయిత గంగాధర్, అన్నారపు వెంకటేశ్వర్లు, కొంగర అప్పారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రుల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ..
కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో నిర్వహించనున్న గణపతి నవరాత్రుల బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి ఆలయంలో జరగనున్న పూజా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నవరాత్రుల బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మికుల హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ సివిల్ కార్యాలయంలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మరిచారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని జీతాలతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గూడెల్లి యాకయ్య, భాషబోయిన రవికుమార్, చిన్ని, విజయ్, డి.శ్రీను, వాటర్ సప్లై ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించండి..


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: గణేష్ మండపాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించిన భక్తులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను సూచించారు. వినాయక మండపాల కమిటీ సభ్యులకు మంగళవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో పలు సూచనలు చేశారు. ఎవరెవరు ఎక్కడెక్కడ మండపం ఏర్పాటు చేస్తున్నారో పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కులమతాలకు అతీతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిమజ్జనం చేసే సమయంలో పోలీసులకు సహకరించాలని, నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల నిరంతరం గస్తీ తిరగుతుంటారని, పట్టణానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు నాగుల్ మీరా పటాన్, బి.సూర్య ఉన్నారు.

పాల్వంచరూరల్: గణేష్ విగ్రహ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని రూరల్ ఎస్‌ఐ బి.సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిమల ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, మైక్, విద్యుత్ అనుమతులు తీసుకుని, పోలీసు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు ప్రొటోకాల్ వైబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అనంతరం పోలీసు అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని పేర్కొన్నారు.

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో గణేష్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని టేకులపల్లి ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

సోలార్ ప్లాంట్‌లో కార్మికుల తొలగింపు


ఆందోళన చేస్తున్న సోలార్ కార్మికులు

ఇల్లెందు: సింగరేణి సోలార్ ప్లాంట్‌లో 35 మంది కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా తొలిగించారంటూ సీఐటీయూ – ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మంగళవారం సోలార్ కార్మికులతో కలిసి జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. నబీ, యాకుబ్‌షావలీ మాట్లాడుతూ.. ఎనిమిది నెలలుగా సోలార్ ప్లాంట్‌లో 35 మంది పని చేస్తున్నారని, వారిని ఎలాంటి కారణం లేకుండా బీహెచ్‌ఈఎల్ కంపెనీ తొలగించడం అన్యాయం అన్నారు. తక్షణమే సింగరేణి అధికారులు స్పందించి కార్మికులను పనిలోకి తీసుకోవాలని కోరారు. తాళ్లూరి కృష్ణ, పాయం వెంకన్న, రామకృష్ణ, గాంధీ, కనకరాజు, భరత్, శివకుమార్, శ్రీను, సతీష్, చెన్నయ్య పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు టెండర్లు పిలవొద్దు..



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఇల్లెందురూరల్: సంక్షేమ బోర్డు పనులు ఎల్ఐసీకి అప్పగించే టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డు ద్వారానే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిలిచిన టెండర్లను రద్దు చేయడంతోపాటు సంక్షేమ బోర్డు సలహా మండలిని నియమించాలని కోరారు. కార్మికులకు పెన్షన్, స్కాలర్‌షిప్, గృహ వసతి, అడ్డాలలో సౌకర్యాల కల్పన వంటివి వెంటనే అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల ప్రమాద బీమా రూ.10 లక్షలకు, ప్రసూతి కానుకను రూ.లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, నాగరాజు, ఎండీ మహమూద్, భద్రు, నరసయ్య, లక్ష్మణ్‌పాసి, రాముపాసి, సుజత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా
సూపర్‌బజార్(కొత్తగూడెం): కార్మికుల సంక్షేమ బోర్డులో నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని నిరసిస్తూ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ఏసీఎల్ షర్ఫుద్దీన్, మణుగూరు ఏఎల్ఓ నాగరాజులకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి మాట్లాడుతూ... కార్మికుల సొమ్ము ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో డి.వీరన్న, కె.సత్య, దొడ్డ రవికుమార్, భూక్యా రమేష్, గుర్రం రాములు, బాలకృష్ణ, ఎస్.రాములు, జాను, సొమ్య, అరుణ, సంధ్య, రఘు, వెంకటేశ్వర్లు, అంజాద్, రాము పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రతీరోజు వైద్యశిబిరాలు


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తేజస్విని

పాల్వంచరూరల్: భారీ వర్షాలకు ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ప్రతీరోజు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఉల్వనూరు పీహెచ్‌సీ డాక్టర్ తేజస్విని అన్నారు. ఉల్వనూరు ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... పీహెచ్‌సీలోని వైద్యసిబ్బందిని ఐదు గ్రూప్‌లుగా విభజించి ప్రతీరోజు ఐదు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించారు. మొదటి గ్రూప్‌కు చెందిన డాక్టర్ తేజస్విని మందేరకలపాడులో వైద్యశిబిరం నిర్వహించగా, రెండో గ్రూప్ డాక్టర్ వినయ్ యానంబైల్ గ్రామంలో, మూడో గ్రూప్ హెల్త్ సూపర్‌వైజర్ సడలాదేవి, నాలుగో గ్రూప్ ఎంపీహెచ్ఎస్ బీమ్‌సింగ్, రామిరెడ్డి, ఐదో గ్రూప్ సీహెచ్ కనకదుర్గ బొల్లోరిగూడెంలోని సబ్ సెంటర్లలో వైద్యశిబిరాలు నిర్వహించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


లెనిన్‌నగర్‌లో పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ఇల్లెందురూరల్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రొంపేడు, కొమరారం వైద్యాధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత సూచించారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో మర్రిగూడెం, రాఘబోయినగూడెం లెనిన్‌నగర్ సబ్‌సెంటర్ల పరిధిలో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి పరిశ్రుభత పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలకు ఆవాసంగా ఉండే ప్రాంతాలను గుర్తించి నీటిలో కిరోసిన్, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం


శిరీషతో డాక్టర్ కవిత, సిబ్బంది

ఇల్లెందురూరల్: ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖవంతమైన ప్రసవాలు పొందుతారని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కవిత అన్నారు. మామిడిగూడెం గ్రామపంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన త్రిష మంగళవారం పురిటి నొప్పులతో ఆస్పత్రికి చేరుకుంది. డాక్టర్ కవిత, సిబ్బంది వెంటనే స్పందించి ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ కవిత తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అన్నివర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'అంగన్‌వాడీ'పై నిరసన


నిరసన తెలుపుతున్న స్థానికులు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పోలెంపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రంలో మురిగిన గుడ్లు, పాడైపోయిన బాలామృతం పంపిణీ చేయడంపై మంగళవారం స్థానికులు నిరసన తెలిపారు. బాలింతలు, గర్భిణులు కేంద్రానికి చేరుకొని అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు వెంకటమ్మను నిలదీశారు.

జూలైలో వచ్చిన గుడ్లను ఇప్పుడెలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. బాలింతలు, చిన్నారుల, బాలింతల, గర్భిణుల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారని వాపోయారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు పంపిణీ చేయడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీ కేంద్రం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయమై అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ.. గుడ్ల సరఫరా తేదీ చూడకపోవడంతో పాత గుడ్లు ఇవ్వడం జరిగిందని, వెంటనే తాజాగా వచ్చిన గుడ్లను లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్మా క్యాంపు, బర్లిఫిట్, సన్యాసి బస్తీ, మధుర బస్తీలలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్తమ ఎంఈఓగా రాంసింగ్

టేకులపల్లి: జిల్లాలో పలువురు ఉత్తమ ఎంఈఓలను ఎంపిక చేయగా అందులో టేకులపల్లి మండల విద్యాధికారి ఠాకూర్ రాంసింగ్ కూడా ఉన్నారు. 2015 సెప్టెంబర్‌లో బేతంపూడి ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధుల్లో చేరిన ఆయన నాటి నుంచి ఇన్‌చార్జ్ ఎంఈవోగా విధులు నిర్వహించారు. గత మేలో జరిగిన బదిలీల్లో ఖమ్మం జిల్లా తల్లంపాడు ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. అయినా టేకులపల్లి ఇన్‌చార్జ్ ఎంఈవోగా కొనసాగుతున్నారు.

ఐడీ కార్డులు అందజేత

పాల్వంచ: పాల్వంచ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస కాలనీ సమీపంలోని రిసార్ట్స్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మైలవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో సభ్యులకు ఐడీ కార్డులు అందజేశారు. ఏడుగురు ఫొటో గ్రాఫర్లకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున రుణాలు అందించారు. సారయ్య, సుధాకర్‌రెడ్డి, వి.రామకృష్ణ, రాజేష్, మోహన్, ఎస్.వెంకటపతి రాజు, నరేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని అనుమతులు లేని భవన నిర్మాణాలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ ఖదీర్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రధానంగా కొత్తగూడెం బస్టాండ్ ఎదురుగా నిర్మాణంలో ఉన్న సెల్లార్, భవనాన్ని పరిశీలించారు. సెల్లార్‌కు మున్సిపాలిటీ నుంచి అనుమతి లేదు, అంతేకాకుండా నిబంధనలు పాటించలేదనే విషయాలను గమనించారు. నివేదికను మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామికి, తహసీల్దార్‌కు అందజేసినట్లు వివరించారు.

ప్రజలే బుద్ధి చెబుతారు..

ఇల్లెందు: ప్రజలు పుట్టెడు కష్టాల్లో ఉన్నారు.. వారిని పరామర్శించటం ప్రతిపక్షాల బాధ్యత అని, ఖమ్మంలో మాజీ మంత్రి టి.హరీష్‌రావు వాహనం మీద కాంగ్రెస్ గూండాలు దాడి చేయటం దుర్మార్గం అని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ అన్నారు. మంగళవారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి దాడులు పునరావృతం అయితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇలాంటి వారికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు.

క్లుప్తంగా

రక్షణపై అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే వర్క్‌షాపులో అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు మంగళవారం వర్క్‌షాపు ఇంజనీర్లు రక్షణపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. పొరపాట్లు చేయకుండా రక్షణ పట్ల అనుక్షణం అప్రమత్తత్తగా ఉండాలన్నారు. పనిస్థలంలో టోపీ, బూట్లు తప్పనిసరిగా వినియోగించాలని, ఇదేక్రమంలో అధికారులు సూచించిన రక్షణ సూత్రాలను పాటిస్తూ, రక్షణతో కూడిన ఉత్పత్తికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాపు ఇంజనీర్లు శంకర్, అనిల్, ఉపేందర్‌బాబు, మధుకృష్ణ, సత్తార్ పాషా, రమేష్, భానుచందర్, ఐమన్స్, యాకుబుద్దీన్ పాల్గొన్నారు.

మాలమహానాడు కమిటీ ఎన్నిక


నియామకపత్రం అందుకుంటున్న వీరస్వామి

జూలూరుపాడు: మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు తుంపురు శివ ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడులో నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బడుగు వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా కాశిమళ్ల కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాశిమళ్ల రజనీబాబు, సెక్రటరీగా మందా రాము, కోశాధికారిగా మందా పుల్లయ్య, జాయింట్ సెక్రటరీగా గత్తం భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వేమూరి గోపయ్య, రాయపూడి ముత్యం, కోఆర్డినేటర్‌గా వేమూరి రాము, గౌరవ అధ్యక్షుడిగా వేమూరి రామస్వామి, యూత్ కమిటీ అధ్యక్షుడిగా కళ్లోజి దినేష్‌లను ఎన్నుకున్నారు.

ఏపీఎస్ఈబీ నిబంధనలు అమలు చేయాలి

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో ఏపీఎస్ఈబీ నిబంధనలు అమలుచేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కలిగిన ఆర్టిజన్ల పట్ల చిన్నచూపు తగదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ అడిషనల్ సెక్రటరీ కూరపాటి రమేష్, జనరల్ సెక్రటరీ నాగేశ్వరరావు, 5,6 దశల రీజనల్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ


గొడుగులు అందజేస్తున్న శ్రీహరిగోపాల్‌శర్మ

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీ శ్రీలక్ష్మీ గణపతి ఆలయం పూజారి శ్రీహరిగోపాల్‌శర్మ యూపీఎస్, ఎంపీపీఎస్ ఉర్దూ స్కూళ్లలోని విద్యార్థులకు మంగళవారం గొడుగులు అందజేశారు. 125 మంది విద్యార్థులు వర్షానికి తడుచుకుంటూ పాఠశాలకు హాజరవుతున్నారన్న సమాచారం తెలుసుకుని వారికి గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆదిలక్ష్మి, మాజీ కౌన్సిలర్ బానోతు రవి నాయక్, సదానందం తదితరులు ఉన్నారు.

పార్కింగ్ షెడ్ మంజూరు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ అంతర్భాగమైన రామవరం 8వ వార్డులోని మాతాశిశు ఆస్పత్రికి నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో వాహనాల పార్కింగ్ కోసం షెడ్ ఏర్పాటుచేయాలని కోరిన మేరకు కలెక్టర్ మంజూరు చేశారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కౌన్సిలర్ కంచర్ల జమలయ్య, స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు, నిరాశ్రయులైన ప్రతీ కుటుంబానికి రూ.1లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేయాలని, ఆస్తి నష్టం అంచనా వేసి సహాయం అందించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాలోత్ వీరు నాయక్, సాయి, జంగం జస్వంత్, గోపీచరణ్ పాల్గొన్నారు.

ఇల్లెందు: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నేలకూలిన ఇళ్లను పరిశీలించి, పరిహారం అందించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డానియేల్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఇల్లెందు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎండీ యాకూబ్, సలీం, మేకల శ్యామ్, రత్తారపు మల్లీశ్వరి, యాదగిరి, కమల్, యాకుబ్‌పాషా, నాగేంద్ర వర్మ పాల్గొన్నారు.